## క్లుప్తంగా

### సీఐగా వీరేంద్రబాబు బాధ్యతలు స్వీకరణ



ఫిరంగిపురం: మండల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.వీరేంద్రబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఫిరంగిపురం పోలీసు స్టేషన్‌కు మొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వం సర్కిల్ హోదా ప్రకటించడంతో వీరేంద్రబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషిచేస్తానని చెప్పారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, శాంతియుత పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

### వలంటీర్లకు నియామక పత్రాలు అందజేత

ఫిరంగిపురం: మండలంలోని నాలుగు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల నియామక ప్రక్రియ పూర్తిచేసి వారికి నియామక పత్రాలు బుధవారం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, ఎంపీడీఓ విమాదేవి ఎంపిక చేసిన ఆరుగురు వలంటీర్లుకు నియామకపత్రాలు అందజేశారు.

### రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్ పరిధిలోని నార్త్ కేబిన్ వైపు రైలు పట్టాలపై బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. 30 సంవత్సరాల వయస్సు ఉంటుందని, మృతుడికి సంబంధించిన వారు ఎవరనేది తెలియలేదు. రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని మృతి చెందినట్లు సీఐ చెప్పారు. మృతదేహం నుజ్జునుజ్జు కావడంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. మృతుడు పసుపు పచ్చచొక్కా, బ్లూ కలర్ జీన్స్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. వివరాలకు జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు, 94400627546, ఎస్ఐ వెంకటాద్రి 7207076614 నంబర్లను సంప్రదించాలి.

### వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కోబాల్ట్ పేటకు చెందిన షేక్ జాకీర్ హుస్సేన్ (40) అప్పుల బాధ భరించలేక బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**జూదరుల అరెస్టు**

సాయినగర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పట్టాభిపురం పోలీసులు బుధవారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 57,440 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### హత్య కేసులో నిందితుల అరెస్టు



గుంటూరు ఈస్ట్: హత్య కేసులో ఇద్దరు నిందితులను నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ నరేష్‌లు బుధవారం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శ్రీనివాసరావుతోటలో మంగళవారం షేక్ మహబూబ్ సుభానీని అతని తల్లి జరీనాబేగం, ఆమె ప్రియుడు షేక్ చిన్నబాజీ కలిసి రోకలి బండతో కొట్టి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు బుధవారం షేక్ చిన్నబాజీ, జరీనాబేగంలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ హత్య జరిగిన 24 గంటల్లోపు నిందితులను అరెస్టు చేయడానికి కృషి చేసిన ఎస్‌హెచ్‌ఓ తోపాటు, సిబ్బందిని అభినందించారు.

### మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. చుట్టుగుంట సెంటర్‌లో ముప్పాళ్ల శివన్నారాయణ మద్యం సీసాలు తరలిస్తుండగా బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి నాలుగు సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**రేషన్ బియ్యం తరలిస్తున్న మహిళ అరెస్టు**

రేషన్ బియ్యం తరలిస్తున్న మహిళపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కోదండరామ 4వ లైనులో ముళ్లపూడి రమణ అనే మహిళ రేషన్ బియ్యం తరలిస్తుండగా, బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

### విజ్ఞాన్ విద్యార్థినికి పీహెచ్‌డీ

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థి దొడ్డ భార్గవి చేపట్టిన పరిశోధనకు గానూ తమ యూనివర్సిటీ బుధవారం పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. 'డిజైన్, సింథసిస్ ఆఫ్ నోవెల్ హెటిరోసైక్లిక్ కాంపౌండ్స్ బేస్డ్ ఆన్ సాక్యుబిట్రిల్, పైపరజిన్ అండ్ ఇండజోల్ మోయిటీస్ అండ్ దేయిర్ బయలాజికల్ యాక్టివిటీస్' అనే అంశంపై భార్గవి పరిశోధన చేసిందని తెలిపారు.

# వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకునేందుకు సిద్ధం

- పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి
- పట్టణంలో గుడ్‌మార్నింగ్ మంగళగిరి



వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న గంజి చిరంజీవి తదితరులు

మంగళగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. గుడ్‌మార్నింగ్ మంగళగిరి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 4వ వార్డులో బుధవారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని ఆరా తీశారు. ప్రతి కుటుంబానికి చేసిన లబ్ధిని వివరించారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. స్థానికంగా వున్న సమస్యల పరిష్కరించేందుకు కృషి చేశారు. చిరంజీవి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో అర్హులందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చిందని చెప్పారు. అదే విధంగా అవ్వతాతలకు పింఛన్లు పెంచడం తోపాటు డ్వాక్రా మహిళలను ఆదుకున్నట్లు చెప్పారు. వైద్యం, విద్యకు ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయించినట్లు వివరించారు. మళ్లీ జగనన్నను సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, పాలేటి కృష్ణవేణి, తోట శ్రీనివాసరావు, ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్, ఎం.సుధారాణి, బి.నరసయ్య పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులపై శ్రద్ధ అవసరం

**కమిషనర్ కీర్తి చేకూరి**



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో రానున్న 10 రోజుల్లో పారిశుద్ధ్య పనుల్లో మార్పు రావాలని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్యం అందించాలని సూచించారు. కమిషనర్ చాంబర్‌లో బుధవారం ప్రజారోగ్య విభాగ, ఇంజినీరింగ్ అధికారులతో నగరంలో పారిశుద్ధ్య పనులు, నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, తరలింపులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటరీ సూపర్‌వైజర్లు ప్రతి రోజు సచివాలయం పరిధిలో పర్యటించి, పారిశుద్ధ్య పనులు సమగ్రంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఎక్కడైనా కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలకు సిఫార్స్ చేయాలని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల వారీగా పారిశుద్ధ్య కార్మికుల రేషనలైజేషన్ జరగాలని, ప్రధాన రోడ్లు, డ్రైన్ల పూడికతీత, ఇంటింటి చెత్త సేకరణకు కార్మికులకు బాధ్యతలు కేటాయించాలని ఎస్ఎస్‌లను ఆదేశించారు. ఈ–ఆటోలు ఉన్న ప్రాంతాల్లో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, తడి పొడి వేరుగా జరగాల్సిందేనని స్పష్టం చేశారు. సచివాలయం పరిధిలో రోడ్లపై, కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు శానిటరీ కార్యదర్శులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. నగరంలో క్లస్టర్ కంపోస్ట్ యూనిట్లను, టెర్రస్, కిచెన్ గార్డెన్‌లను ప్రోత్సహించాలని, వారికి అవసరమైన కోకోపిట్‌ను అందించాలని ప్రజారోగ్య అధికారుల్ని ఆదేశించారు. ప్రధాన రహదారుల్లో రాత్రి సమయంలో పారిశుద్ధ్య పనులు చేపట్టడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎంఓహెచ్, ఎంహెచ్‌ఓలను ఆదేశించారు. నగరంలో పారిశుద్ధ్య పనుల కోసం కేటాయించిన ట్రాక్టర్లు, కాంపాక్టర్లు, ఈ–ఆటోలకు జీపీఎస్, డంపింగ్ యార్డ్‌ల వద్ద సీసీ కెమెరాల విజువల్స్ వచ్చేలా అధునాతన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేయాలని ఎస్ఈ, ఈఈలను ఆదేశించారు. పొన్నూరు రోడ్డులో జీటీఎస్ వద్ద నూతన వే బ్రిడ్జిని నిర్మించాలని ఎస్ఈకి సూచించారు. నగరంలో పెండింగ్‌లో ఉన్న జీటీఎస్‌ల నిర్మాణ పనులను వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వెహికిల్ షెడ్‌లోని వాహనాలపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని, నగరంలో పారిశుద్ధ్య పనుల కోసం ఎక్కడ అవసరం ఉన్నా వెంటనే సంబంధిత వాహనాన్ని అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, సీఎంఓహెచ్ డాక్టర్ డి.ఆషా, ఎంహెచ్‌ఓ (ఎఫ్ఏసి) మధుసూదన్, ఈఈ కొండారెడ్డి, ఎస్ఎస్‌లు రాంబాబు, ఆనందకుమార్, ఆయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం దిశగా కృషి చేయాలి




శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సుబ్బరామిరెడ్డి

గుంటూరు రూరల్: రైతు సంక్షేమం కోసం తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను రైతులకు అందించే విధంగా రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎ సుబ్బరామిరెడ్డి తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాంఫాం నందున్న సమావేశ మందిరంలో రాష్ట్రంలోని 23 మంది కృషీ విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు, 13 మంది ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తలు, 26 మంది వ్యవసాయ శాఖలోని డీఆర్‌పీ సభ్యులకు వివిధ విభాగాల్లో సాంకేతిక నైపుణ్యం పెంపొందించేందుకు మూడు రోజులపాటు శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతు స్థాయిలో దిగుబడులు తగ్గకుండా ఉండటం కోసం నూనె గింజలు, అపరాలు, చిరుధాన్యాల పంటలలో దిగుబడిని పెంచేందుకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని ఈ శిక్షణ తరగతుల్లో తెలుసుకోవచ్చన్నారు. పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్ ప్రశాంతి మాట్లాడుతూ విస్తరణ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో సమస్యలను చాలా నిశితంగా పరిశీలించాలని వాటిని నూతన పరిశోధన అంశాలతో తీసుకునే విధంగా తెలియజేయాలని సూచించారు. వేరుశనగలో దిగుబడి పెంచే విషయాలను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏ ప్రసన్నరాజేష్, పొద్దుతిరుగుడు, కుసుమ పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నీలిమ, అపరాల దిగుబడి పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎమ్ వి రమణ, చిరుధాన్యాలలో సాగును, దిగుబడిని పెంచే విధానాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవి లత, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీవీ చంద్రమోహన్‌రెడ్డిలు వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి రామారావు, అగ్రికల్చర్ డీన్ డాక్టర్ జి కరుణాసాగర్, డీన్ డాక్టర్ రమణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ ఏ మణి, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ బి విజయాభినందన, డాక్టర్ జి శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు సామాజిక పరిశీలన కీలకం



విద్యార్థులతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, రామకృష్ణమూర్తి, పీఎం ప్రసాద్, అధ్యాపకులు

**ఎమ్మెల్సీ లక్ష్మణరావు**

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక పరిశీలన కీలకమని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు సూచించారు. మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో ఇంటర్మీడియెట్ విభాగ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి అంతర్ కళాశాలల క్విజ్, వక్తృత్వ పోటీల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ లీలా మోహన్‌రావు పోటీల్ని ప్రారంభించారు. బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలంటే ఇటువంటి పోటీల్లో పాల్గొని అనుభవాన్ని గడించాలని తెలిపారు. చదువుతోపాటు సామాజిక పరిశీలన కూడా చాలా అవసరమని వివరించారు. కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులంతా పోటీల్లో పాల్గొనడం ద్వారా జీవితంలో మంచి స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కళాశాల అలైడ్ కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందుతాయని తెలిపారు. ఈ సందర్భంగా 22 జూనియర్ కళాశాలల విద్యార్థులకు క్విజ్, వక్తృత్వంలో పోటీల్ని నిర్వహించారు. క్విజ్ పోటీల్లో తెనాలి వైష్ణవి జూనియర్ కళాశాల, గుంటూరులోని టీజేపీఎస్ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, వక్తృత్వంలో తెనాలి వైష్ణవి కళాశాల, నల్లపాడులోని సెయింట్ జోసెఫ్ కళాశాల విద్యార్థినులు బహుమతులు గెలుపొందారు. కళాశాల ఇంటర్మీడియెట్ విభాగ ఇన్‌చార్జ్ డాక్టర్ మంజుశ్రీ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో కళాశాల ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గాప్రసాద్, ఐక్యూఏసీ ఇన్‌చార్జి డాక్టర్ పి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

# ఓటరు మార్పు, చేర్పులపై అశ్రద్ధ వద్దు

**అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి**

నెహ్రూనగర్: ఓటరు మార్పు, చేర్పు, తొలగింపుల దరఖాస్తులను బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌ఓ)లు ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ కె.రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం పశ్చిమ నియోజకవర్గ బీఎల్‌ఓలు, సూపర్‌వైజరీ అధికారులతో ఎన్నికల ఓటర్ల తుది జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఓటరు తుది జాబితా అనంతరం నూతన ఓటు నమోదు, మార్పుల దరఖాస్తులు అందుతున్నాయని, వాటిని బీఎల్‌ఓలు నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఓటర్ల వివరాలు తుది జాబితాలో సక్రమంగా వచ్చే వరకు బీఎల్‌ఓలదే బాధ్యతని, అనధికారికంగా సెలవులు తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### పిల్లల ఆరోగ్యాన్ని కాపాడండి



మాట్లాడుతున్న దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ

తాడేపల్లిరూరల్: నులి పురుగులు నివారణతో పిల్లల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణ పేర్కొన్నారు. దుగ్గిరాల ప్రభుత్వ వైద్యశాలలో ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న నులి పురుగుల నివారణా దినోత్సవంపై డాక్టర్ ఇందిర అధ్యక్షత వివిధ శాఖల అధికారులతో విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. అరుణ మాట్లాడుతూ నులి పురుగుల కారణంగా చిన్నారుల శరీరంలో అనేక రకాల సమస్యలు తలెత్తుతాయన్నారు. నివారణకు ప్రభుత్వం ప్రత్యేక మందు ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి. భార్గవి, దుగ్గిరాల పీహెచ్‌సీ వైద్యులు సుకన్య, ఎంఈఓలు శ్రీనివాసరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

### రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ రాజారమేష్

ఫిరంగిపురం: జగనన్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ రాజారమేష్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు అందజేసిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో త్వరితగతిన పూర్తి చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని చెప్పారు. మండలంలో 1327 వరకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 825 వరకు పూర్తి అయ్యాయన్నారు. సమావేశంలో ఆర్ఐ అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

### తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



గుంటూరు ఈస్ట్: మతిస్థిమితం లేని బాలుడు పాఠశాల నుంచి తప్పిపోగా పట్టాభిపురం పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంగడిగుంటకు చెందిన ఎం.ఫణి అనే 16 సంవత్సరాల మతిస్థిమితం లేని బాలుడు జేకేసీ కళాశాల రోడ్డులోని దాక్షిణ్య పాఠశాలకు వెళ్లి తప్పిపోయాడు. పట్టాభిపురం పీఎస్ కానిస్టేబుల్ భూపతి ఎస్వీఎన్‌కాలనీ పదో లైనులో గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎస్‌హెచ్‌ఓ విజయచంద్ర బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

### రేపటి నుంచి టీ-20 క్రికెట్

తెనాలి: జనాబ్ అబ్దుల్ సత్తార్‌ఖాన్ మెమోరియల్ రాష్ట్రస్థాయి 3వ టీ–20 క్రికెట్ చాంపియన్‌షిప్ ఈనెల 9నుంచి తెనాలిలో నిర్వహించనున్నారు. ఈ మేరకు పట్టణానికి చెందిన డాక్టర్ రియాజ్‌ఖాన్, యువ క్రికెట్ అకాడమీ కోచ్ మాలిక్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజీ క్రీడా మైదానంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి క్రీడాకారులకు పురస్కారాలను ఇవ్వనున్నట్లు వివరించారు.

### ముగిసిన యజుర్వేద పారాయణ మౌఖిక పరీక్ష



పెదకాకాని: శివాలయంలో ఖాళీగా ఉన్న కృష్ణ యజుర్వేద పారాయణం ఉద్యోగానికి బుధవారం జరిగిన మౌఖిక పరీక్ష ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్ర దేవదాయ శాఖ కార్యాలయం నియమించిన కమిటీ సభ్యులైన వెంకట రామకృష్ణ శర్మ( రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, నెల్లూరు), కె త్రినాథ కళ్యాణ చందు( శ్రీకాళహస్తి దేవస్థానం) ఆధ్వర్యంలో, రాష్ట్ర దేవదాయ శాఖ ఏడీసీ టి చంద్రకుమార్, సత్యనారాయణమూర్తి, ఆలయ ఈవో ఎస్ శ్రీనివాసరెడ్డి ల పర్యవేక్షణలో అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ వేద పారాయణ ఉద్యోగానికి మొత్తం 55 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఇంటర్వ్యూకు 43 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షకు సంబంధించి ఉత్తీర్ణత చెందిన అభ్యర్థి పేరును రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పించి తదుపరి వెల్లడించడం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు



చిన్నారికి వైద్య సేవలు అందిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ మానస

తాడేపల్లిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు అని డాక్టర్ మానస అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని డోలాస్‌నగర్ అంబేడ్కర్ కాలనీలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. డాక్టర్ మానస మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో ఎంతోమంది మహిళలు ఆరోగ్య సమస్యలతో వస్తున్నారని, వారందరికి ఉన్న ఆరోగ్య సమస్యలను ప్రాంతాల వారీగా ఏఎన్ఎంలు ముందుగానే తెలుసుకుని అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారని, జగనన్న ఆరోగ్య సురక్షలో ఈ ఒక్కరోజే 680 మంది మహిళలు, చిన్నారులు వైద్య సేవల కోసం విచ్చేశారని చెప్పారు. వారందరికీ వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామని, ఐదుగురికి కళ్ల సమస్యలు ఉన్నట్లు గుర్తించి శస్త్రచికిత్స నిమిత్తం ఎన్ఆర్ఐ ఆస్పత్రికి రిఫర్ చేశామని, ముఖ్యంగా గర్భిణులు ఎదుర్కొంటున్న సమస్యలను గైనకాలజిస్ట్ డాక్టర్ జ్యోతిక వైద్య పరీక్షలు నిర్వహించారు. జనరల్ మెడిసన్‌తో పాటు ఆర్థోపెడిక్, కంటి వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందించారని చెప్పారు. గత శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేసినట్లు డాక్టర్ మానస తెలిపారు.

# గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

**ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శివశంకరరావు**



సమావేశంలో మాట్లాడుతున్న శివశంకరరావు

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించనున్న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. బుధవారం రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు అధ్యక్షతన ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో రైతు సమావేశం నిర్వహించారు. శివశంకరరావు మాట్లాడుతూ నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తీసుకొచ్చారని, ఈ విధానాల వలన రైతులు పండించిన పంటలను సరైన మద్దతు ధర కల్పించలేదని విమర్శించారు. దేశ సంపదను, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు పార్లమెంట్‌లో నల్లచట్టాలను తీసుకువచ్చారని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను తుంగలో తొక్కి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చటం అటు పారిశ్రామిక రంగాన్ని, ఇటు కార్మికులను మోసం చేయడమేనని అన్నారు. ఆల్ ఇండియా కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న నిర్వహించనున్న గ్రామీణ బంద్‌లో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బడుగు వెంకటేశ్వరరావు, బొద్దు ప్రసాద్, అమర ఉమా మహేశ్వరరావు, అమ్మిశెట్టి సుబ్బారావు, బొద్దు బాసయ్య పాల్గొన్నారు.

# గణతంత్ర వేడుకల్లో కేఎల్‌యూ విద్యార్థిని ప్రతిభ



ఎన్‌సీసీ క్యాడెట్ ని అభినందిస్తున్న కేఎల్‌యూ అధ్యక్షులు కోనేరు సత్యనారాయణ తదితరులు

తాడేపల్లిరూరల్: ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న కేఎల్‌యూ విద్యార్థినిని వర్సిటీ అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ బుధవారం అభినందించారు. వర్సిటీలో సమావేశంలో కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కోమల్ ఎన్‌సీసీ 22 ఆంధ్రా బెటాలియన్‌లో క్యాడెట్‌గా పనిచేస్తూ గత నెల 26వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోట వద్ద నిర్వహించిన గణతంత్ర వేడుకల పరేడ్‌లో పాల్గొని ప్రతిభ చూపినట్లు చెప్పారు. 27 రాష్ట్రాల నుంచి హాజరైన క్యాడెట్లలో కోమల్ ఒకరని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని కోమల్, లెఫ్టినెంట్ వి.మౌనికను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.హనుమంతరావు, సలహాదారులు డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్ అభినందించారు.

# వైఎస్సార్ సీపీలో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం

- డెప్యూటీ సీఎం అంజాద్‌బాషా
- 1.97 కోట్లతో నిర్మించిన పెదకాకాని బాజీబాబా దర్గా రోడ్డు, ప్రహరీగోడకు ప్రారంభోత్సవం



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: ముస్లిం మైనార్టీలకు చట్టసభల్లో గౌరవ స్థానం కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖా మంత్రి, డెప్యూటీ సీఎం ఎస్‌డీ అంజాద్ బాషా అన్నారు. ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రమైన పెదకాకాని బాజీబాబా దర్గా చుట్టూ నిర్మించిన ప్రహరీ, ప్రధాన రోడ్డు నుంచి దర్గాలోనికి రూ.1.97 కోట్లతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యతో కలిసి బుధవారం ఆయన ప్రారంభోత్సవం చేశారు. అనంతరం బహిరంగసభలో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, డెప్యూటీ సీఎం ఎస్‌డీ అంజాద్‌బాషా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దర్గా ఈఓ ముక్తార్‌భాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు జిలాని, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ కలయిక



గురువు రత్నారెడ్డి దంపతులను సత్కరిస్తున్న విశ్రాంత గురువులు

గుంటూరు ఎడ్యుకేషన్: అర్ధ శతాబ్దం తరువాత స్వర్ణోత్సవ కలయిక నిర్వహించుకున్న పూర్వ విద్యార్థులు ఒకనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువును ఆత్మీయంగా సత్కరించుకున్న సంఘటన గుంటూరు నగరంలో జరిగింది. యాభై ఏళ్ల కిందట నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా బుధవారం గుంటూరు నగరంలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో విందులు, వినోదాలతో కాలక్షేపం చేయకుండా జీవితపు చివరి అంచులకు చేరిన తమ గురువును వెతుక్కుంటూ వెళ్లి ఘనంగా సత్కరించారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో 1973–76 బ్యాచ్‌కి చెందిన విద్యార్థుల్లో అధిక శాతం మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులుగా స్థిరపడ్డారు. మరికొంతమంది అనేక ఉన్నత పదవుల్లో పని చేశారు. సుదీర్ఘ విరామం తర్వాత కలుసుకున్న వారంతా తొలుత ఉభయ కుశలోపరి నిర్వహించారు. తర్వాత తమకు విద్యాబుద్ధులు నేర్పి ప్రస్తుతం విద్యానగర్‌లో శేషజీవితం గడుపుతున్న రాజనీతి శాస్త్ర విశ్రాంత ఆచార్యులు డాక్టర్ వై.రత్నారెడ్డి దంపతులను కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కంజుల సత్యనారాయణరెడ్డి, వెంకట్రావు, కృపానందం, నరసింహారెడ్డి, నాగరాజు, శౌరమ్మ, చిన్నమ్మ, ఉషారాణి, కృపారావు, సుబ్బారావు, కోటేశ్వరరావు, అప్పారావు, జార్జి, గాలీబు, హనుమంతరావు, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.